ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో 93.96 శాతం పోలింగ్ నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న 1,712 మంది ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 1,822 మంది ఉపాధ్యాయ ఓటర్లకు 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 1,712 మంది ఓటర్లు, 93.96 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పురుషులు 1105 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 607 మంది మహిళా ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. అత్యధికంగా తెలకపల్లి పోలింగ్ కేంద్రంలో 97.30 శాతం నమోదు కాగా, అత్యల్పంగా కోడెరు పోలింగ్ స్టేషన్‌లో 77.78 శాతం నమోదైంది. ఎన్నికల సరళిని కలెక్టర్ ఉదయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూం నుంచి పరిశీలించారు. బల్మూర్‌లో 62 ఓట్లకు 54 మంది వేయగా 94.5శాతం, తిమ్మాజీపేటలో 14 మంది ఓటర్లకు 13 మంది ఓటర్లు ఓటు వేశారు. బిజినేపల్లిలో 74 ఓట్లకు 72 ఓట్లు పోలైనట్లు, 97 శాతం పోలింగ్ జరిగినట్లు తెలిపారు. ఎన్నికల కేంద్రాన్ని కలెక్టర్ ఉదయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మోతిలాల్, ఆర్‌డీఓ నాగలక్ష్మి సందర్శించి పోలింగ్‌ను పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 354 ఓట్లకు 329 ఓట్లు నమోదయ్యాయి. కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 174 ఓటర్లు ఉండగా 168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డీఓ హనుమనాయక్ పరిశీలించారు. అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 316 ఓట్లు ఉండగా 299 ఓట్లు పోలయ్యాయి. లింగాలలో 30 మంది ఓటర్లు ఉండగా 28 మంది ఓటు వేసినట్లు ప్రిసైడింగ్ అధికారి బీష్యనాయక్ తెలిపారు. ఉప్పునుంతలలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 29 ఓట్లకు 27 ఓట్లు పోలయ్యాయి. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో 39 ఓట్లకు 36 ఓట్లు పోలైనట్లు ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. కోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 18మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 14మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


అచ్చంపేటలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్


కొల్లాపూర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయ దంపతులు


కోడేరులో ఓటుహక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు


కల్వకుర్తిలో ఓటు వినియోగించుకున్న మహిళా ఉపాధ్యాయులు


కల్వకుర్తిలో బీజేపీ నాయకులతో రాంచందర్‌రావు


తెలకపల్లిలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌డీఓ నాగలక్ష్మి


బల్మూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాలయ్య, అంజనాచారిలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మేడివిజన్ ఆస్పత్రి సహకారంతో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు, హెల్త్ కార్డు తీసుకొని రావాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ జయమ్మ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి సీసీ రోడ్డు మంజూరు చేయడంతో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. సోమవారం గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ అఖిల్ గ్రామంలో 246 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఇటీవల మొదలైన ఉపాధిహామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా రోడ్ల వెంట కంప చెట్లు, వీధులు శుభ్రపరచడం వంటి పనులు చేపట్టారు. అంతేకాకుండా మలుపుల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపడుతున్నారు. త్వరలో పంట పొలాల్లో పనులు కొనసాగిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ మౌలాలి తెలియజేశారు.

పెద్దమ్మగుడి నిర్మాణానికి భూమి పూజ

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లకి చెందిన పెద్దమ్మ గుడిని నూతనంగా నిర్మించడానికి సోమవారం సర్పంచ్ నాగరాజుతో కలిసి నిర్మాణ దాతలు మోహన్‌రావు, సురేందర్‌రావులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఖర్చులతో గుడి నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రజిత, వార్డుమెంబర్లు రామస్వామి, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ నిరంజన్‌రావు, మాజీ సర్పంచ్ రంగస్వామి, నాగరాజు, ఖాదర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం సంఘటన్‌యాత్ర



పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో బీజేవైఎం నాయకులు లింగస్వామి సోమవారం సంఘటన్‌యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకాలపై ప్రచారం నిర్వహించేందుకు యాత్ర చేస్తున్నామని తెలిపారు. కిసాన్‌సమ్మాన్‌యోజన పథకం, ప్రధానమంత్రి జీవనజ్యోతి, రైతువేదికలు, శ్మశానవాటికలకు కేంద్రప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

తర్నికల్‌లో రైతుల క్షేత్ర పర్యటన



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో సోమవారం కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ హర్వంత అనే కొత్త ఉత్పత్తిని రైతులకు అందజేసింది. రైతులు పంటను పరిశీలించేందుకు గ్రామంలో క్షేత్ర సందర్శనకు వచ్చారు. కంపెనీ ప్రతినిధులు రాంబాబు, విజయభాస్కర్, అమృతా రెడ్డి, రామకృష్ణలు నూతన విత్తనం పనితీరును రైతులకు వివరించారు. ఈ విత్తనంతో రైతులకు అధిక దిగుబడి సాధ్యమవుతుందని వివరించారు.

ఘనంగా మత్స్యకారుల పండుగలు

తెలకపల్లి: మండల కేంద్రంలో వారం రోజులుగా మత్స్యకారులు ఎల్లమ్మ పండుగలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. సోమవారం మండల కేంద్రంలోని పురవీధుల్లో ఎల్లమ్మ దేవతతో పాటు రాక్షసి వేషధారణలో విన్యాసాలతో ర్యాలీ నిర్వహించారు. వారం రోజులుగా జరుగుతున్న ఈ పండుగల్లో సోమవారం వినూత్నంగా డప్పు, వాయిద్యాలతో, జముకు చప్పుళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ ఎత్తున ప్రజలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అల్లాపూర్, మేడిపూర్ పాఠశాలలను సోమవారం ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తొలిమెట్టు శిక్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం నిర్వహణ, పాఠశాలలకు సంబంధించిన వివిధ రకాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.


విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకుంటున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తోటపల్లికి చెందిన గంగమ్మకు రూ.38 వేలు, బసవయ్యకు రూ.18 వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్దన్, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, బాలయ్య, మనోహర్‌రెడ్డి, భాస్కరరావ్, గణేశ్, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు


అయోధ్యకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కందనూలు: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సారథ్యంలోని ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామకోటి స్తూప నిర్మాణ పూజా జరగనుండటంతో నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే, క్యాంపు కార్యాలయం నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 11 మంది బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు శ్రీశైలం, కొండ కింది మాధవరెడ్డి, రామేశ్వరరావు, ఆనంద్ గౌడ్, కేశవులు గౌడ్, బాలాగౌడ్, అమరేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

సమీక్షా సమావేశం



చారకొండ: మండల కేంద్రంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జయసుధ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల వారిగా అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికలు అందించారు. గ్రామాల వారిగా ఉపాధి పనులపై సమీక్షించారు. ఉపాధి కూలీల హాజరును ఎన్‌ఎంఎంఎస్ ద్వారా నమోదు చేయాలన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని రామాపురంలో అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ భారతి చేతుల మీదుగా అంబలి కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ సేవా సంస్థ ఇన్‌చార్జ్ అర్జున్‌గౌడ్, పాఠశాల చైర్మన్ శిరీష, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రామస్వామి, దర్గయ్య పాల్గొన్నారు

కాంసానిపల్లిలో గుడిసె దగ్ధం

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లికి చెందిన కుందేటి లింగమయ్య, బాలమ్మ దంపతులకు చెందిన పూరి గుడిసె ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. ఆ సమయంలో కొందరు స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న ఆహారధాన్యాలు, దుస్తులు, వంట పాత్రలు, విలువైన కాగితాలు కాలి బూడిదయ్యాయి. ప్రతి రోజు కూలీ పనులు చేసుకుని బతుకుతున్నామని, తమను ఆదుకోవాలని ఆ దంపతులు వేడుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సర్పంచు లక్ష్మీనారాయణ తక్షణసాయంగా రూ. 2వేలు, 25కేజీల బియ్యం అందించారు. దాతల సహకారంతో రేకుల ఇళ్లు నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.

ఆస్కార్ అవార్డు రావడంపై హర్షం

కొల్లాపూర్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై పట్టణవాసులు హర్షం వెలిబుచ్చారు. తెలుగు సినిమా కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ సురగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సినీ దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, గేయ రచయిత చంద్రబోస్, గాయకులు కాలభైరవ, రాహుల్‌సిప్లిగంజ్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. అదేవిధంగా తెలుగు భారతీ సాహితీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఆమని కృష్ణ, మధుసూదన్ శర్మ, కవి, రచయితలు గూడేలి శీనయ్య, పరశురాముడు, వేముల కోటయ్య, డాక్టర్ పంద్రప్రగడ రాంచందర్‌రావులు కూడా అభినందనలు తెలిపారు. ఆస్కార్ స్థాయిలో తెలుగు సినిమాలు నిలబెట్టడం అందరికీ గర్వకారణమన్నారు.

ఆలయంలో పూజలు

ఊర్కొండ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఊర్కొండపేటలో సత్యనారాయణ స్వామి శివలింగ సరస్వతి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత నాగోజీ, వైస్ ఎంపీపీ అరుణ్, నాయకులు ప్రకాశ్, ఈశ్వర్, మండల అధ్యక్షుడు వీరారెడ్డి, మ్యాకల శ్రీనివాసులు, హరీశ్, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



కల్వకుర్తిరూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల విభాగంలో కల్వకుర్తి పంజుగుల, తోటపల్లి, తదితర పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు బహుమతులు సాధించారు. విద్యార్థులందరూ వీరనారి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కోచ్ నాగరాజును సోమవారం అభినందించారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

కల్వకుర్తి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కవిత జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో వెల్దండ జెడ్పీటీసీ సభ్యురాలు విజితారెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షురాలు పావని, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపీపీ గోవర్దన్, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, భాస్కర్‌రావు, మాధవరెడ్డి, గణేశ్, బాలయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని జాగృతి కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. జాగృతి జిల్లా కన్వీనర్ మిర్యాల పావని ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌గౌడ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కంటి పరీక్షలు చేయించుకోండి

ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాతాపూర్‌లో కంటి వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని ప్రభుత్వం అందించే అద్దాలను తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసు పెట్టడంతో రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. అనంతరం చంద్రబండతండాలో హనుమాన్ దేవాలయం నిర్మాణ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సర్పంచ్ రాములాల్, శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు రాజేందర్‌గౌడ్, చంద్రయ్య, రవినాయక్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


సాతాపూర్ కంటి వైద్య శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

ఇష్టానుసారంగా సీసీ రోడ్ల పనులు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా పాలకులు వాటిని వరంగా మార్చుకుంటున్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోడ్ల పనులు చేపట్టాల్సి ఉండగా నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా పనులు చేపడుతూ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రూ.2.69 కోట్లతో 56 సీసీ రోడ్ల పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా ఆయా గ్రామాలలో పనులను అధికారులకు సమాచారం ఇవ్వకుండా చేపట్టడంతో సమస్యగా మారింది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పనులు చేపట్టడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. మంజూరైన పనులు ఈ మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలనే నిబంధనలు ఉండడంతో ఏకకాలంలో ఆయా గ్రామాలలో పనులు చేపట్టడంతో అధికారులు పర్యవేక్షించే సమయం కూడా దొరకడం లేదని చెప్పవచ్చు. ఇదే మంచి తరుణమని భావిస్తున్న కొంత మంది ఆదరాబాదరగా పనులు చేస్తుండడంతో పనులలో నాణ్యత లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. రూ.కోట్లల్లో ఖర్చు చేసి చేపట్టిన రోడ్ల పనులలో నాణ్యత పాటించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో పీఆర్‌డీఈ భాషునాయక్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలోనే పనులు చేపట్టాలని, పనుల్లో నాణ్యత లేకపోతే పనులు చేయిస్తున్నవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇకపై పనులపై పర్యవేక్షణ జరుపనున్నట్లు తెలిపారు.


క్యాంపు రాయవరంలో సీసీ రోడ్డు పనులు

ప్రమాదకర రాళ్ల తొలగింపు

కోడేరు: మండల కేంద్రంలోని పస్పులకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పెద్ద బండరాళ్లు ఉండటంతో తరచూ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో తన సొంత ఖర్చులతో ప్రధాన రోడ్డు అంచున ఉన్న రాళ్లను తొలగించారు. ఇదే స్థలంలో రాళ్లను ఢీకొని ముగ్గురు మృత్యువాత పడ్డారని, నలుగురు ద్విచక్ర వాహనదారులు కింద పడి కాళ్లు, చేతులు విరిగిపోయాయని అన్నారు. ప్రమాదకరంగా ఉన్న రాళ్లను తొలగించడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు. అదే విధంగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడి స్పీడ్ బ్రేకులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లాలు, పాఠశాల చైర్మన్ మంగలిశేఖర్, మిద్దె రాజు, మద్దిలేటి, కిరణ్, కన్నయ్యపాల్గొన్నారు.


రాళ్లను తొలగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

తాడూరు: మండలంలోని పొల్మూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులైన విద్యార్థులు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ బహుమతులు అందజేశారు.


ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, భక్తులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని కుర్మ కొంటె వంశస్తులు ఎల్లమ్మ, బీరప్ప పండుగలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగించారు. ఎల్లమ్మ దేవాలయం నుంచి గ్రామ పురవీధుల్లో డోలు చప్పుల్లతో, డముకు మోతలతో, శివసత్తుల పూనకాలతో పోతురాజుల విన్యాసాలతో ఎల్లమ్మ వేషధారణతో పెత్త ఎత్తున బోనాలను తీసుకొని ఊరేగింపుగా వెళ్లారు. కొంటె వంశస్తులు నాలుగు రోజులు బండారులతో పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ. లక్ష విరాళం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డు సమీపంలో ఉన్న చెన్నకేశవ దేవాలయ పునర్నిర్మాణానికి 18వ వార్డు కౌన్సిలర్ గోపిశెట్టి శివ సోమవారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కౌన్సిలర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న కౌన్సిలర్ శివ

ఆర్టీసీ ఉద్యోగులకు చల్లని మజ్జిగ


ఉద్యోగులకు మజ్జిగ అందిస్తున్న డీఎం రాజశేఖర్

అచ్చంపేట రూరల్: వేసవికాలంలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులకు చల్లని మజ్జిగ ఏర్పాటు చేశామని డీఎం రాజశేఖర్ తెలిపారు. సోమవారం డిపోలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వేసవికాలం ముగిసే వరకు చల్లని మజ్జిగ అందుబాటులో ఉంటుందని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పీటీ కుమార్, స్వామి పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని శాలివాహన సంఘం కార్యాలయంలో సోమవారం కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదయ్య, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్, చందు, మల్లేష్, వెంకటేష్, జంగయ్య, సురేష్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న శాలివాహన నాయకులు